# ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**అదనపు కలెక్టర్ విక్టర్**

కామారెడ్డి, ఏప్రిల్ 22 : రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రతి పాఠశాల నుంచి ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ను నియమించినట్లు అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో జిల్లాలోని అన్ని ఎంపీపీఎస్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 807 మంది హెచ్‌ఎంలు, 553 చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు రెండు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియమితులైన ప్రొటెక్షన్ ఆఫీసర్లు పాఠశాలల్లో పిల్లలు ఎటువంటి లైంగిక దాడులకు గురికాకుండా వాటిని ప్రారంభ దశలోనే అణిచివేసే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. స్టూడెంట్ లాగా కాకుండా సొంత పిల్లలుగా భావించాలని, పిల్లల్లో నమ్మకం అనేది కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఏడు విడుతలుగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. దాదాపు మొత్తం 2013 మంది ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. అదనపు సూపరింటెండెంట్ చైతన్యారెడ్డి మాట్లాడుతూ.. పిల్లలకు ఏదైనా జరిగితే ఆ పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, స్వర్ణలత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారిణి సుకన్య, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డేవిడ్ రాజ్, బాల రక్షాబంధన్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన




మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ స్వంగాన్

భిక్కనూరు/రామారెడ్డి, ఏప్రిల్ 22 : భూ భారతి చట్టంపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. భిక్కనూరులోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణ చేసుకోవచ్చని చెప్పారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డుల జారీ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. రామారెడ్డిలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సంజయ్, తహసీల్దార్ ఉమా లత, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



మెంగారం గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో

లింగంపేట, ఏప్రిల్ 22 : లింగంపేట మండలంలోని మెంగారం, ఎల్లారం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. భూ భారతి చట్టంలో లింగంపేట మండలాన్ని అధికారులు పైలెట్ గ్రామంగా ఎంపిక చేయడంతో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మెంగారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్ కిరణ్‌తోపాటు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 22 : బీర్కూర్ శివారులోని మంజీరా పరీవాహక ప్రాంతంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వారి నుంచి ఆరు సెల్ ఫోన్లు, రూ.7,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

కామారెడ్డి, ఏప్రిల్ 22 : జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఉన్న బీఎస్‌ఎన్ఎల్ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వినియోగదారులు తమ ఫిర్యాదులు, బిల్లులకు సంబంధించిన వాటిపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈ సురేందర్ మాట్లాడుతూ.. వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించామన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

## రజతోత్సవ సభ పోస్టర్ల ఆవిష్కరణ

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 22 : ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న రజతోత్సవ కార్యక్రమ వాల్ పోస్టర్లను నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. నెమ్లి గ్రామంలోని వీధుల్లో గోడ ప్రతులను బీఆర్ఎస్ నాయకులు అతికించారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి చలో వరంగల్ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు గౌడ్, సాయిలు, దత్తు, టేకుర్ల సాయిలు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్మన్‌దేవ్‌పల్లిలో చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఫాంపాండ్స్‌ను నిర్మించుకోవాలి

లింగంపేట, ఏప్రిల్22: ప్రతి రైతు వ్యవసాయ బోరుబావుల వద్ద ఫాంపాండ్స్‌ను నిర్మించుకోవాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. లింగంపేట మండలంలోని మోతె గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ తన వ్యవసాయ పొలంలో నిర్మించిన ఫాంపాండ్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఫాంపాండ్స్ నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఉపాధి హామీ పథకంలో ఫాంపాండ్స్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు, సాంకేతిక సహాయకుడు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి

మాచారెడ్డి, ఏప్రిల్ 22 : ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ మండంలోని ఘన్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలోని వృక్షాలకు డిజిటల్ సమాచారం నిమిత్తం బార్ కోడ్‌ను అతికించారు. ఈబార్ కోడ్‌పై ఫోన్‌తో స్కాన్ చేస్తే మొక్క ఉపయోగం, దానికి సంబంధించి పూర్తి సమాచారం వస్తుందని ప్రధానోపాధ్యాయురాలు శారద తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, దేవీచంద్, నవనీత, రజిత, స్కౌట్ మాస్టర్ గోపాలకృష్ణ, ఇలియాస్, ఇకో క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.



వృక్షాలకు వేసిన బార్ కోడ్‌తో విద్యార్థులు

## సిల్వర్ జూబ్లీ వేడుకలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 22 : ఈ నెల 24న ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ కళాశాలలో నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రాంగణంలో ఈ నెల 24న నిర్వహించనున్న కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. అనంతరం సిల్వర్ జూబ్లీ వేడుకల ఆహ్వాన పత్రాలను అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ వేణు గోపాల స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల కోసం లబ్ధిదారుల గుర్తింపు



లింగుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

బీబీపేట్(దోమకొండ), ఏప్రిల్ 22 : ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన వారిని గుర్తిస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దోమకొండ మండలం లింగుపల్లి గ్రామంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మంగళవారం పర్యటించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఇండ్ల దరఖాస్తులదారుల పరిశీలన**

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 22 : మండలంలోని అడ్వి లింగాల్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల పరిస్థితిని మంగళవారం ఎంపీడీవో ప్రకాశ్ పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వం తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తుందని ఆయన తెలిపారు. పంచాయతీ సెక్రటరీ శంకరయ్య పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా నేరస్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఏఎస్పీ చైతన్యారెడ్డి

కామారెడ్డి, ఏప్రిల్ 22 : మూడేండ్లుగా వివిధ జిల్లాల్లో తాళం వేసిన ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ చైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాసాయిపేట్‌కు చెందిన పందిగోటి రాముతో పాటు పలువురు మూడేండ్లుగా వివిధ జిల్లాల్లో తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులపై దేవునిపల్లి, ఇతర పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. పందిగోటి రాము తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడేవాడని తెలిపారు. బీరువాలను పగలగొట్టి విలువైన బంగారం, వెండి ఇతర వస్తువులను దొంగిలించేవాడన్నారు. అతనికి సహకరించిన స్నేహితులు మాసాయిపేట్‌కు చెందిన బద్నాపురం మల్లేశ్, కొప్పుల పల్లికి చెందిన వడ్డెర నవీన్, తూప్రాన్‌కు చెందిన శ్యాంలాల్, రినివార్ రాజారాం, ముల్లెవ గౌతం చౌదరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వీరినుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు, అర కేజీ వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసులను ఛేదించిన ఏఎస్పీ చైతన్యారెడ్డి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, దేవునిపల్లి ఎస్సై రాజు, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, పీఎస్సీ సిబ్బంది కృష్ణారెడ్డి, రవికిరణ్, రామస్వామి, శంకర్ రాజు, సీసీఎస్ సిబ్బంది స్వామి, శ్రీను, మైసయ్య, లక్ష్మీకాంత్‌ను ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

## కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



సీసీలతో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ నరేందర్

లింగంపేట, ఏప్రిల్ 22 : సెర్ప్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని డీఆర్డీవో సురేందర్ సూచించారు. లింగంపేట మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో మంగళవారం సీసీలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రం నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం తూకం వేసిన రైతుల వివరాలు వెంట వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించి లోన్ బీమా క్లెయిమ్స్ పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల దుస్తుల కొలతలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. సమీక్షా సమావేశంలో ఏపీఎం చామంతి శ్రీనివాస్, సీసీలు శ్రావణ్‌కుమార్, రాజిరెడ్డి, గంగారాజు, నజీర్, మెహర్, మన్సూర్, స్వప్న, అంజయ్య, స్త్రీనిధి మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## తూము నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

లింగంపేట, ఏప్రిల్ 22 : లింగంపేట మండలం పోల్కంపేట గ్రామంలోని చౌదరి చెరువు తూము నిర్మాణ పనులను గ్రామస్తులు మంగళవారం ప్రారంభించారు. చౌదరి చెరువు తూము నిర్మాణం కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.37 లక్షలు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించినట్లు వారు తెలిపారు. తూముకు గండి పడిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్వక్, నాయకులు నాగరాజుగౌడ్, మాసుల శివయ్య, అజయ్‌గౌడ్, శ్రీనివాస్, సంజీవరెడ్డి, కృష్ణమూర్తి, బండ రమేశ్, ఆగమయ్య, రాజు, నరశ్, సతీశ్ పాల్గొన్నారు.

## నోటు పుస్తకాలు, బ్యాగు అందజేత



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రామారెడ్డి, ఏప్రిల్ 22 : తాను దత్తత తీసుకున్న ఓ విద్యార్థినికి ఆంజనేయులు అనే ఉపాధ్యాయుడు నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగుతోపాటు వెయ్యి రూపాయల నగదు మంగళవారం అందజేశాడు. మండలంలోని రెడ్డిపేట్ స్కూల్‌తండాకు చెందిన గంగావత్ బిందు అనే చిన్నారి (రెండో తరగతి) మూడు నెలల క్రితం కూల్‌డ్రింక్ అనుకొని పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. సదరు చిన్నారిని స్కూల్ తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై రంగంపేట్‌కు వెళ్లి ఆంజనేయులు దత్తత తీసుకున్నాడు. పదో తరగతి వరకు తాను చదివిస్తానని బాధ్యత తీసుకొన్నాడు. ఇందులోభాగంగా మంగళవారం వచ్చే విద్యా సంవత్సరానికి సరిపడా నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగుతోపాటు వెయ్యి రూపాయల నగదును అందజేయ గా, ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ తండా పెద్దలు బుచ్చిరెడ్డి, గంగావత్ రాజేందర్, రవి, బల్‌రాం, తిరుపతి పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సన్మానిస్తున్న డీఈవో

రామారెడ్డి, ఏప్రిల్ 22: మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి చదువుతున్న ఎం. అక్షర 68వ జాతీయస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 25 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పుట్‌బాల్ పోటీల్లో (అండర్-14 బాలికల విభాగంలో) తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున పాల్గొననున్నది. ఈ నేపథ్యంలో విద్యార్థిని అక్షరను డీఈవో రాజు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాస్, పీడీ కుశనోల్ల చంద్రయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## తెలుగు భాషను కనుమరుగు చేసే చర్యలను నిలిపివేయాలి



అదనపు కలెక్టర్ విక్టర్ వినతిపత్రం అందజేస్తున్న తెరవే నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 22 : తెలుగు భాషను కనుమరుగు చేసే చర్యలను ప్రభుత్వం నిలిపివేయాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోతరగతి వరకు తెలుగు పరవాలేదని ఇంటర్మీడియేట్ నుంచి ద్వితీ య భాషగా సంస్కృతాన్ని ప్రోత్సహిస్తూ తెలుగును నిర్వీర్యం చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. ఈ చర్యలను కవులు, రచయితలు ఖండిస్తున్నారని తెలిపారు. ఇంటర్‌లో తెలుగు రద్దు ఆలోచన విరమించుకోవాలన్నారు. లేకుంటే తెరవే ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలను చేపడతామని అన్నారు. కార్యక్రమంలో తెరవే జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మోహన్ రాజ్, పీతాంబర్, గంగాప్రసాద్, రామచంద్రం, చంద్రకాంత్, తిరుపతిరావు పాల్గొన్నారు.

## మహిళా ఆత్మహత్యా యత్నం.. కాపాడిన పోలీసులు



మహిళను కాపాడిన పోలీసులు

కామారెడ్డి, ఏప్రిల్ 22 : జిల్లా కేంద్రంలోని రైల్వేట్రాక్‌పై సోమవారం రాత్రి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా, పోలీసులు కాపాడారు. పట్టణంలోని జయశంకర్ కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ పై ఓ మహిళా ఆత్మహత్య చేసుకోవడానికి యత్నిస్తుండగా.. పట్టణ పోలీసు స్టేషన్‌కు చెందిన బ్లూ కోర్ట్ -1 బృందం కానిస్టేబుల్ నరసింహులు, హోంగార్డు వసంత్‌కు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే వారు అక్కడికి వెళ్లి మహిళను కాపాడారు. అనంతరం బాధిత మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనలో సమయస్ఫూర్తితో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ నరసింహులు, హోంగార్డు వసంత్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

## బీడీ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న శివంది సత్యం

మాచారెడ్డి, ఏప్రిల్ 22 : బీడీలు చేసే కార్మికుల పిల్లలకు బీడీ స్కాలర్ షిప్‌లు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. మండలంలోని మంథనిదేవునిపల్లిలో బీడీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీనామా చేసిన కార్మికులకు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రూ.5 వేలు పెన్షన్ చెల్లించాలన్నారు. రాజేందర్, రాజమణి, లక్ష్మి, బాలమణి, రాధ, కళావతి, రాజవ్వ, సుగుణ పాల్గొన్నారు.

## స్పీడ్‌బ్రేకర్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 22 : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు స్థానిక నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో స్థానిక నాయకులు లింగమయ్య, సాయిబాబు, సాయికుమార్ ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో వీడ్కోలు సమావేశం

లింగంపేట, ఏప్రిల్ 22 : లింగంపేట మండలం ఐలాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమా లు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దామోదర్, ఉపాధ్యాయులు శివనంద, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు వేయించాలి



మెంగారంలో టీకాలు వేస్తున్న పశువైద్యురాలు

ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట, ఏప్రిల్ 22 : పశువులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలని మత్తమాల పశువైద్యాధికారిణి డాక్టర్ అర్చన అన్నారు. మండలంలోని పెద్దారెడ్డి, వెల్లుట్లపేట గ్రామాలకు చెందిన 16 మంది రైతుల వద్ద ఉన్న 149 ఆవులు, ఎద్దులు, 274 బర్రెలకు గాలికుంటు నివారణ టీకాలను మంగళవారం వేసినట్లు ఆమె తెలిపారు. ఆమెతోపాటు గోపాలమిత్ర సాయిరెడ్డి తదితరులున్నారు. లింగంపేట మండలం మెంగారం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్యాధికారిణి హాన జోనస్ తెలిపారు. 15 ఆవులు, 20 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఫసియొద్దీన్, గోపాల మిత్రలు ఎజాస్, శివలాల్, రైతులు పాల్గొన్నారు.

## కారు, ఆటో ధ్వంసం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 22 : బీర్కూర్ మండల కేంద్రంలోని మేకల రాజుకు చెందిన కారు, ఆటోను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసినట్లు బాధితుడు తెలిపాడు. రూ. 2లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నాడు. బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపాడు.

## ఇంటర్‌లో ప్రైవేట్ కళాశాలల హవా

కామారెడ్డి, ఏప్రిల్ 22 : ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో కామారెడ్డి పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల హవా కొనసాగింది. జిల్లా కేంద్రంలోని సాందీపని విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకుగాను డి.రచన, నేహాకు 994 మార్కులు, అమూల్య 993 మా ర్కులు సాధించారు. బైపీసీలో సాయిరిష్వత్ రెడ్డి 993, భాగ్యలక్ష్మి 992 మార్కులు సాధించారు. సీఈసీలో ఫర్హాన బేగం 980, అక్షిత్ రెడ్డి 976 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 470 మార్కులకు మాన్యశ్రీకి 467, మహతి, హర్షిత 466 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకుగాను అస్మా జాగన్‌కు 436, విశాలాక్ష్మి 433 మార్కులు సాధించారు. సీఈసీలో 500 మార్కులకుగాను సాత్వికకు 491, టిమోతి 484 మార్కులు సాధించారు. వీఆర్‌కే జూనియర్ కళాశాలలో బైపీసీలో పూర్వజకు 994, ఎంపీసీలో విద్వేశ్‌కు 993, సీఈసీలో నందిని 935 మార్కులు సాధించారు. ఎస్ఆర్‌కే కళాశాలలో ఎంపీసీలో 991, ఇంటర్ మొదటి సంవత్సరంలో చరణ్ 464 మార్కు లు సాధించారు. శ్రీఆర్యభట్ట కళాశాల విద్యార్థులు వైష్ణవికి 992, హరిప్రదీప్ 990 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో నిమిత, సంజన, అనుప్ రెడ్డి, రుచిత, వినూత్న 463 మార్కులు సాధించారు. విజన్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కృష్ణకు 985, రాంచరణ్‌కు 982, మొదటి సంవత్సరంలో ఎంపీసీలో నితీష, శివాణికి 462, ఎంఈసీలో గౌతీ యువరాజ్ 485 మార్కులు సాధించారు. వీరికి ఆయా కళాశాలల యాజమన్యం అభినందించింది.



రచన | నేహా | పూర్వజ | ఇందువర్ష | వైష్ణవి | హరిప్రదీప్ | వంశీ | యువరాజ్